## 22న జిల్లాస్థాయి బాక్సింగ్ సెలెక్షన్స్

మిర్యాలగూడ టౌన్, ఏప్రిల్ 19 : పట్టణంలోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో ఈ నెల 22న బాక్సింగ్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా యూత్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రవీందర్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సెలక్షన్స్‌కు 2006, 2007 సంవత్సరంలో పుట్టిన బాలబాలికలు అర్హులని తెలిపారు. సెలెక్ట్ అయిన వారికి ఈ నెల 26, 27న హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే స్టేట్ యూత్ మెన్ అండ్ ఉమెన్ చాంపియన్ షిప్‌లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల బాలబాలికలు 9959196986 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## రెండో రోజు 4 నామినేషన్లు

నీలగిరి, ఏప్రిల్ 19 : లోకసభ ఎన్నికల నామినేషన్లలో భాగంగా రెండో రోజు శుక్రవారం నల్లగొండ పార్లమెంటు నియోజకవర్గానికి 4 నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులుగా కిన్నెర యాదయ్య, బండారు నాగరాజు, ధర్మ సమాజ్ పార్టీ తరఫున తలారి రాంబాబు, మార్క్సిస్ట్ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా(యునైటెడ్) పార్టీ తరఫున వస్కుల మట్టయ్య నామినేషన్లు వేశారు. వీరంతా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందనకు తమ నామినేషన్ పత్రాలను అందజేశారు.

# కాంగ్రెస్ నాలుగు నెలల పాలనకే ప్రజలు విసుగెత్తిపోయిండ్రు

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- అర్వపల్లిలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం ప్రారంభం

అర్వపల్లి/శాలిగౌరారం, ఏప్రిల్ 19 : కాంగ్రెస్ నాలుగు నెలల పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌తో కలిసి అర్వపల్లి మండల కేంద్రం నుంచి శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, బూడిద భిక్షమయ్యగౌడ్‌తో కలిసి క్యామ మల్లేశ్ యోగానంద లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కోలాటాలు, డప్పుచప్పుళ్లతో అర్వపల్లి వై జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అడ్డగోలు, అమలు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని అన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. నిరుద్యోగ భృతి, కల్యాణలక్ష్మి, తులం బంగారం, మహిళలకు 2500, నెలకు 4 వేల పింఛన్, రైతు భరోసా ఇప్పటికీ ఇయ్యలేదన్నారు. రెండు లక్షల రుణమాఫీ అమలు కాలేదని, రైతు కూలీలకు 12 వేల ఊసేలేదన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి నేడు వాటిని విస్మరిస్తున్నారని ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నా కనీసం ఇవ్వడానికి చేతగాని అసమర్థ ప్రభుత్వమని పేర్కొన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ మంత్రి పదవుల కోసం పోటీ పడుతున్నారు తప్ప ప్రజలకిచ్చిన హామీలపై ఏనాడూ మాట్లాడడం లేదన్నారు. పాలన చేయమంటే తప్పించుకొని తిరుగుతున్న దద్దమ్మ రేవంత్ అని విమర్శించారు. దేశానికి, రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందని ఓటేయాలని ప్రశ్నించారు. ఓట్ల కోసం తెలంగాణ నీళ్లను ఇతర రాష్ట్రాలకు మళ్లించుకోవాలని కుట్రలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు పార్టీలో ఏ పార్టీకి ఓటు వేసినా మోరీలో వేసినట్టే అని అన్నారు. మన ఆశలు నెరవేరాలంటే ఢిల్లీలో బీఆర్ఎస్ ఉండాల్సిందేనని చెప్పారు. ప్రతి కార్యకర్త కేసీఆర్‌లా పని చేసే బీఆర్ఎస్ అభ్యర్థి, బలహీన వర్గాల నాయకుడు, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీ, జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌పై పూర్తి వ్యతిరేకత వచ్చిందని, బీఆర్ఎస్ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలువబోతున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ.. ఎప్పుడూ ప్రజల పక్షాన నిలిచే పార్టీ బీఆర్ఎస్ అని, పార్లమెంట్‌లో తెలంగాణ గలాన్ని వినిపించే బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం శాలిగౌరారంలో జరిగిన ప్రచారంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు, రైతులు సంతోషంగా ఉన్నారని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఓటర్ బీఆర్ఎస్‌కు జై కొట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. కేసీఆర్ పదేండ్ల పాలనలో ఒక్కసారైనా పొలాలు ఎండిపోలేదన్నారు. తాగు, సాగునీటి కోసం ఏనాడూ ప్రజలు, రైతులు ఇబ్బందులు పడిన దాఖలాలు లేవన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కరువు తాండవిస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో సూర్యాపేట జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు, జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, పార్టీ మండలాధ్యక్షులు గుండగాని సోమేశ్‌గౌడ్, ఐతగోని వెంకన్న గౌడ్, రాష్ట్ర నాయకులు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, మొరిశెట్టి ఉపేందర్, చాడ హతీశ్‌రెడ్డి, గుండా శ్రీనివాస్, కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, గుజిలాల్ శేఖర్‌బాబు, కొన్‌రెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, గంట శంకర్, జెర్రిపోతుల చంద్రమౌళిగౌడ్, దాసరి వెంకన్న, అక్కెనపెల్లి శ్రీరాములు, చివుట సైదులు, వేల్పుల నరేందర్, పాల్గొన్నారు.



అర్వపల్లిలో ఎన్నికల ప్రచారం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యేలు కిశోర్, భిక్షమయ్యగౌడ్



శాలిగౌరారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్, పక్కన ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భిక్షమయ్యగౌడ్



అర్వపల్లిలో ప్రచారానికి భారీగా హాజరైన జనం

### హామీలను అమలు చేయని కాంగ్రెస్‌ను బొందపెట్టాలి

**- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్**

మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్‌ను, సీఎం రేవంత్‌రెడ్డిని ఎంపీ బొందపెట్టాలని అన్నారు. గత ఎన్నికల్లో పాలు ఇచ్చే బర్రెను అమ్ముకొని దున్నపోతును తెచ్చుకున్నట్లు ప్రస్తుతం రాష్ట్రంలో పాలన ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా రైతుబంధు, 2 లక్షల రుణమాఫీ, కల్యాణలక్ష్మి, తులం బంగారం, రూ.2500 ఏమయ్యాయని ప్రశ్నించారు. మనమంతా కలిసికట్టుగా పని చేసి భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి గులాబీ దళపతి కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని అన్నారు.

### మీ సేవకుడిగా వస్తున్నా ఆశీర్వదించండి : క్యామ మల్లేశ్



బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ.. మీ సేవకుడిగా ముందుకు వస్తున్నాను. తనను ఆదరించి ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో కేసీఆర్ పిలుపునందుకొని భువనగిరి ఎంపీ అభ్యర్థిగా వచ్చానని, మీ బిడ్డగా, మీ అన్నగా, మీలో ఒకడిగా ఆశీర్వదిస్తే జీవితాంతం పని చేస్తానని తెలిపారు. తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజలకు కావాల్సిన వనరులను కొట్లాడి సాధిస్తామన్నారు. ప్రజలు గమనించి మోసకారి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని సూచించారు.

# నేటి నుంచి కంచర్ల ప్రచారం

- ఆత్మకూర్(ఎస్) నుంచి ప్రారంభం
- పాల్గొననున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- ప్రతిరోజూ మూడు మండలాలు
- ఎండల తీవ్రతతో ఉదయం, సాయంత్రమే ప్రచారం
- 23న నామినేషన్‌కు ఏర్పాట్లు




నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ నల్లగొండ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి ప్రచార షెడ్యూల్ ఖరారైంది. నేటి నుంచి ప్రచార గడువు ముగిసే మే 11 వరకు రోజువారీ షెడ్యూల్‌కు తుది రూపం ఇచ్చారు. మొత్తం 21 రోజుల్లో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలతోపాటు మున్సిపల్ కేంద్రాలను చుట్టి వచ్చేలా షెడ్యూల్‌ను రూపొందించారు. నిత్యం రెండు లేదా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థి ప్రచారం కొనసాగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. క్షేత్రస్థాయి వరకు బీఆర్ఎస్ ప్రచారం వెళ్లేలా చూస్తున్నారు. మరోవైపు నిత్యం గ్రామాలతోపాటు పట్టణాల్లోనూ పార్టీ శ్రేణులన్నీ ఎక్కడికక్కడే స్థానికంగా ప్రచారం నిర్వహించనున్నారు. ఈ ప్రచారాన్ని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, ఇతర ముఖ్యనేతలు పర్యవేక్షించనున్నారు. సూర్యాపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆత్మకూర్(ఎస్) మండల కేంద్రం నుంచి ప్రచారం ప్రారంభించనున్నారు. శనివారం సాయంత్రం 4 గంటలకు నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డితోపాటు పార్టీ ముఖ్యులంతా పాల్గొననున్నారు. అక్కడి నుంచి యంత్రం 4 గంటలకు హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని గరిడేపల్లి మండలంలో ప్రచారం కొనసాగనున్నది. నిత్యం అభ్యర్థి ప్రచారం కొనసాగేలా షెడ్యూల్‌ను రూపొందించారు. ఈ నెల 21న సాయంత్రం 4 గంటలకు గుర్రంపోడు, 6 గంటలకు కనగల్, 22న ఉదయం 10 గంటలకు పాలకవీడు, సాయంత్రం 4 గంటలకు అడవిదేవులపల్లి, 6 గంటలకు పెన్‌పహాడ్‌లో అభ్యర్థి ప్రచారం కొనసాగనున్నది. 24న మోతె, అనంతగిరి, మేళ్లచెర్వు, 25న డిండి, పెద్దవూర, తిప్పర్తి, 26న మఠంపల్లి, మునగాల, చివ్వెంల, 27న తిరుమలగిరి(సాగర్), పీఏపల్లి, చింతపల్లి, 28న నడిగూడెం, చింతలపాలెం, చిలుకూరు. 29న చందంపేట, నేరేడుగొమ్ము, నిడమనూర్, 30న నేరేడుచర్ల మున్సిపాలిటీలో ప్రచారం చేయనున్నారు. మే 2న వేములపల్లి, త్రిపురారం, 3న హాలియా, 4న హుజూర్‌నగర్, మాడ్గులపల్లి, 5న కోదాడ, 6న దేవరకొండ, కొండమల్లేపల్లి, 8న మిర్యాలగూడ టౌన్, 10న సూర్యాపేట టౌన్, చివరి రోజు నల్లగొండ పట్టణంలో ప్రచారం కొనసాగేలా షెడ్యూల్ ఖరారు చేశారు. ఇందులో పరిస్థితులను బట్టి కొన్ని మార్పులు చేర్పులు ఉండవచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి.

### ఈ నెల 23న నామినేషన్..

బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి ఈ నెల 23న మంగళవారం రోజున ఉదయం 11గంటలకు నల్లగొండలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. కార్యక్రమానికి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని పార్టీ నేతలు, కార్యకర్తలు తరలివచ్చేలా ప్లాన్ చేస్తున్నారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, ఎన్నికల సమన్వయకర్తలు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్యులు హాజరుకానున్నారు. నామినేషన్ అనంతరం పార్టీ కార్యాలయం నుంచి క్లాక్‌టవర్ వరకు రోడ్‌షో నిర్వహించి అక్కడే పార్టీ శ్రేణులను ఉద్దేశించి నేతలు ప్రసంగించనున్నారు.



ట్రాన్స్‌పోర్టు అధికారితో ఫోన్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావ్

## ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- కలెక్టర్ ఎస్.వెంకట్రావ్
- అర్వపల్లిలో ఐకేపీ సెంటర్ పరిశీలన

అర్వపల్లి, ఏప్రిల్ 19 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకట్రావ్ ఆదేశించారు. శుక్రవారం అర్వపల్లి ఐకేపీ సెంటర్‌ను పరిశీలించి మాట్లాడారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతులకు డబ్బులు వచ్చేందుకు ట్యాబ్ ఎంట్రీని వెంటనే చేయాలని సూచించారు. ఈ సందర్భంగా సంబంధిత సెంటర్ ఇన్‌చార్జి లారీల కొరత ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ట్రాన్స్‌పోర్టు అధికారితో ఫోన్‌లో మాట్లాడి, ప్రతిరోజు సెంబర్‌కు 3 నుంచి 4 లారీలు పంపాలని ఆదేశించారు.

కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, తాసీల్దార్ శ్రీనివాసులు, ఏఓ శశిధర్‌రెడ్డి, ఏపీఎం వలిశెట్టి మల్లేశ్, ఏఈఓ శోభారాణి, సెంటర్ నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.

## మరో రూ.94 కోట్ల ధాన్యం మాయం

- రఘురామ రైస్‌మిల్లులో తనిఖీల అనంతరం అధికారుల నిర్ధారణ
- యాజమాన్యంపై కేసు నమోదు

సూర్యాపేట, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : కస్టం మిల్లింగ్ రైస్ తనిఖీల్లో భాగంగా మరో ఫార్ బాయిల్డ్ రైస్ మిల్లులో కోట్ల రూపాయల అక్రమాలు వెలుగు చూశాయి. నాగారం మండలం ఈటూరు వద్ద గల రఘురామ ఫార్‌బాయిల్డ్ రైస్‌మిల్లులో అధికారులు తనిఖీలు చేసి ధాన్యం తక్కువ ఉన్నట్లు నిర్ధారించారు. ఈ మేరకు సివిల్ సప్లయ్ శాఖ అధికారుల ఫిర్యాదుల మేరకు ఇమ్మడి సోమనర్సయ్య, సోమయ్య, అంజయ్యపై కేసులు నమోదు చేశారు. ఇప్పటికే తిరుమలగిరి మండల కేంద్రంలోని సంతోష్ రైస్ మిల్లులో రూ.90 కోట్లు, కోదాడ శ్రీవెంకటేశ్వర్ రైస్ ఇండస్ట్రీస్‌లో రూ.64 కోట్ల ధాన్యాన్ని పక్కదారి పట్టించడంతో ఆయా యాజమాన్యాలపై కేసులు నమోదు కాగా, తాజాగా రఘురామ మిల్లులో రూ.94 కోట్లు కలిపి రూ.248 కోట్ల ధాన్యం పక్కదారి పట్టిందంటే అక్రమాలు ఏ స్థాయిలో జరిగాయో అర్థం చేసుకోవచ్చు. గత రెండు సీజన్లలో కోట్లాది రూపాయల ధాన్యం తీసుకొని ఒక్క కిలో బియ్యం కూడా పెట్టని తొమ్మిది మిల్లుల నుంచి ప్రభుత్వానికి అందాల్సిన కస్టం మిల్లింగ్ రైస్ సుమారు రూ.520 కోట్ల విలువ చేసే 4,500 ఏసీకేలు అందాల్సి ఉంది. వీటిలో నేరేడుచర్ల, దిర్శించర్ల, కోదాడల్లో ఒక్కో మిల్లు ఉండగా తిరుమలగిరిలో ఆరు మిల్లుల నుంచి 289 కోట్ల విలువ చేసే బియ్యం అందాల్సి ఉంది. విచిత్రమేంటంటే దాదాపు 30 కోట్ల విలువ చేసే బియ్యం ఇవ్వాల్సిన కొన్ని మిల్లుల అడ్రస్ ఎక్కడ ఉందో ఎవరికీ అంతు పట్టడం లేదు.



## 22లోగా పోస్టల్ బ్యాలెట్ ఫామ్ అందజేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దాసరి హరిచందన

నీలగిరి, ఏప్రిల్ 19 : ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, అత్యవసర సేవలు అందించే శాఖల ఉద్యోగులందరికీ ఫారం-12ను ఈ నెల 22లోగా అందజేయాలని, ఆయా సంబంధిత శాఖల అధికారులు కూడా ధ్రువీకరణ ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌పై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆయా శాఖల ద్వారా ఎంత మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 జారీ చేసింది, ఎంతమంది తిరిగి ఇచ్చింది డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశించారు. ఏ ఉద్యోగి కూడా పోస్టల్ బ్యాలెట్ రాలేదని ఫిర్యాదు చేయకూడదని, ఒకవేళ అలాంటి ఫిర్యాదులు వస్తే సంబంధిత శాఖ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర సేవలు అందించే శాఖల ఉద్యోగులు, డ్రైవర్లు, ఆఫీసు సబార్డినేట్లు సైతం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంకా ఎవరైనా శాఖల ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 తీసుకోనట్లయితే తక్షణమే తీసుకొని పూర్తి వివరాలతో నింపి సంబంధిత ధ్రువపత్రాలు జత చేసి ఈనెల 22 నాటికి సమర్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ నోడల్ అధికారులతో సమీక్షిస్తూ ఆయా అంశాల వారీగా తగు సూచనలను జారీ చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, తక్కువ ఓటింగ్ శాతం ఉన్న పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటరు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, హోం ఓటింగ్‌పై మరోసారి సమావేశాన్ని నిర్వహించాలని, సి-విజిల్, సువిధ వంటి యాప్‌లు చురుకుగా పనిచేసేలా చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత నోడల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, జిల్లా రెవెన్యూ అధికారి రాజ్యలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

## హైవేపై ఇంజినీరింగ్ లోపాలను సవరించాలి

- సర్వీస్ రోడ్లను పూర్తి చేయాలి
- జంక్షన్లు, గ్రామాల వద్ద సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి
- రోడ్డు భద్రతపై సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట సిటీ, ఏప్రిల్ 19 : రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణలో భాగంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాహుల్ హెగ్డే జాతీయ రహదారుల భద్రత సంస్థ, జీఎంఆర్, ఎన్‌హెచ్-65 పరిధిలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలతో రోడ్డు భద్రత సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో జాతీయ రహదారి సుమారు 80 కిలోమీటర్లు విస్తరించి ఉందని, ఈ మార్గం వాణిజ్య, రవాణా పరంగా ఇతర రాష్ట్రాలను కలుపుతూ నిత్యం రద్దీగా ఉంటుందని, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగి ఎంతో మంది మృత్యువాత పడుతున్నారని ఎస్పీ తెలిపారు. ఈ మార్గంలో లోపాలను గుర్తించినట్లు చెప్పారు. ముఖ్యంగా ఇంజినీరింగ్ లోపాలున్నాయని, ఎక్కడ పడితే అక్కడ రోడ్డు మధ్యలో డివైడర్‌ను కట్ చేశారని, గ్రామాల నుంచి వచ్చే లింక్ రోడ్లు ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. సర్వీస్ రోడ్లు పూర్తి కాలేదని, గ్రామాల వద్ద సూచిక బోర్డులపై అవగాహన లోపం ఉందన్నారు. చాలా జంక్షన్ల వద్ద ఫ్లైఓవర్ల అవసరం ఉందని, పాసెజ్‌ల హైట్ కూడా తక్కువగా ఉండడంతో పెద్ద వాహనాలు వెళ్లడం లేదన్నారు. హైవేపైకి వచ్చే గ్రామీణ రోడ్లు సరైన లెవల్ లేవని, అవసరమైన చోట సైన్ బోర్డుల ఏర్పాటుతోపాటు సెంట్రల్ లైటింగ్ తక్కువగా ఉందన్నారు. వీటిని ఎన్‌హెచ్ఏఐ, జీఎంఆర్ అధికారులు సమన్వయంతో సవరించేందుకు కృషి చేయాలన్నారు. ఎన్‌హెచ్ఏఐ, జీఎంఆర్ అధికారులు మాట్లాడుతూ ఎన్‌హెచ్-65పై ఇప్పటికే చాలా జంక్షన్లు, బ్లాక్ స్పాట్స్ వద్ద ఇంజినీరింగ్ లోపాలను సవరిస్తున్నామని తెలిపారు. త్వరలోనే అన్ని లోపాలను సవరిస్తామని, సెంట్రల్ లైటింగ్ పెంచుతామని చెప్పారు. సమావేశంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, ట్రైనీ ఐపీఎస్ రాజేశ్‌మీనా, ఎన్‌హెచ్ -65 టెక్నికల్ మేనేజర్ రాధేశ్యాం పైనీ, ఎన్‌హెచ్ఏఐ మేనేజర్ శ్రీకాంత్, జీఎంఆర్ అధికారులు మల్యాద్రినాయుడు, నాగకృష్ణ, స్పెషల్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ జితేందర్‌రెడ్డి, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు రాజశేఖర్, రజితారెడ్డి, చివ్వెంల, మునగాల, కోదాడ రూరల్ ఎస్ఐలు, ట్రాఫిక్ ఎస్ఐలు, రోడ్డు సేఫ్టీ బ్యూరో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాజాపేటలో వడగండ్ల వాన

- నేల రాలిన వరి, మామిడి కాయలు
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం



రాజాపేట : జాల గ్రామంలో నేలవాలిన వరిచేను

రాజాపేట, ఏప్రిల్ 19 : మండలంలోని సింగారం, జాల, కొత్తజాల గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. దాంతో ధాన్యం నేల రాలి చేలు నేల వాలాయి. భారీ ఈదురుగాలులకు మామిడి కాయలు రాలాయి. రేకుల కొట్టాలు ఎగిరిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. అకాల వడగడ్ల వానతో అపార నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. సుమారు 60 ఎకరాల్లో వరి ధాన్యంతోపాటు మామిడి తోటలు దెబ్బతిన్నాయని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

### పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

అకాల వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని జాలలో వడగండ్ల వర్షంతో దెబ్బతిన్న వరి పొలాలతోపాటు నేల రాలిన మామిడి, ఎగిరిపడిన కొట్టాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షంతో అన్నదాతలకు అపార నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట ఎంపీపీ గోపగాని బాలమణీయాదగిరిగౌడ్, బీఆర్ఎస్ మహిళాధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ గొల్లపల్లి రాంరెడ్డి, బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మర్ల నాగరాజు పాల్గొన్నారు.



రాజాపేట : సింగారంలో తడిసిన ధాన్యం

## జిల్లా సబ్ జైలు తనిఖీ

సూర్యాపేట లీగల్, ఏప్రిల్ 19 : సూర్యాపేట జిల్లా సబ్ జైల్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ రాజగోపాల్ శుక్రవారం తనిఖీ చేశారు. విచారణ ఖైదీలతో మాట్లాడారు. న్యాయవాదిని పెట్టుకోలేని వారి కోసం న్యాయ సేవాధికార సంస్థ డిఫెన్స్ న్యాయవాదులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉచిత న్యాయ సహాయం కోసం నిందితులు డిఫెన్స్ న్యాయవాదులు, జైలు అధికారులతో మాట్లాడి సహాయం పొందవచ్చన్నారు. ఆయన వెంట న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి, డిఫెన్స్ న్యాయవాదులు ఉన్నారు.